ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
ఆదివారం, 25 ఆగస్టు 2024 www.prajaaswaramdaily.com 4 PM



# చెరువులను చెర విడిపిస్తాం..

**భగవద్గీత బోధనానుసారమే చెరువులను కాపాడుతున్నాం**

**కొందరు శ్రీమంతులు విలాసాల కోసం చెరువుల్లో ఫామ్‌హౌస్‌లు**

**ఎవరు ఎంత ఒత్తిడి తెచ్చిన తగ్గేదే లేదు : సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 25 (ప్రజాస్వరం) : అక్రమార్కుల చెర నుంచి చెరువులను విముక్తి చేసేందుకే హైడ్రాను తీసుకువచ్చామని సీఎం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వంపై ఎవరు ఎంత ఒత్తిడి వస్తున్నా వెనక్కి తగ్గకుండా అక్రమ నిర్మాణాలను కూలగొడుతున్నట్లు చెప్పారు. చెరువులు ఆక్రమించిన వారు ఎంతటివారైనా వదిలిపెట్టమని హెచ్చరించారు. ఈమేరకు ఆదివారం హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అనంత శేష స్థాపన ఉత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. విధ్వంసానికి పాల్పడితే ప్రకృతి మనమీద కక్ష కడుతుందని వ్యాఖ్యానించారు. అధర్మం ఓడాలంటే యుద్ధం తప్పదన్న శ్రీకృష్ణుడి మాటలే తనకు స్ఫూర్తి అని చెప్పారు. భగవద్గీత బోధనానుసారం చెరువులను కాపాడుతున్నట్లు వెల్లడించారు. కొందరు శ్రీమంతులు విలాసాల కోసం చెరువుల్లో ఫామ్ హౌస్ లు నిర్మించారని, వాటి నుంచి వచ్చే డ్రైనేజీ నీరు చెరువుల్లో కలుపుతున్నారన్నారు. హైదరాబాద్ నగరంను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సీఎం పేర్కొన్నారు. 'రాజకీయం కోసమే.. నాయకులపై కక్ష్య కోసమే కూల్చివేతలు చేయడం లేదు. అక్రమ నిర్మాణాలు వదిలేస్తే.. నేను ప్రజా ప్రతినిధిగా విఫలమైనట్లే. శ్రీకృష్ణుడి గీతాబోధన అనుసారమే ఈ అక్రమ నిర్మాణాల కూల్చివేత. చెరువుల ఆక్రమణదారుల్లో ప్రభుత్వాలను ప్రభావితం చేసేవారున్నారు, ప్రత్యక్షంగా ప్రభుత్వంలో భాగస్వాములైన వారు కూడా ఉండవచ్చు, సమాజాన్ని ప్రభావితం చేసేవారు ఉండవచ్చు.. వారెవరిని పట్టించుకోను. ఎవరు ఎంత ఒత్తిడి తెచ్చినా చెరువులను ఆక్రమించిన వారి భరతం పడతాం' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

## క్రీడా కార్యక్రమాలకే గచ్చిబౌలి స్పోర్ట్స్ విలేజ్

క్రీడా కార్యక్రమాలకే గచ్చిబౌలి స్పోర్ట్స్ విలేజ్ ను వినియోగిస్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 'ఎన్ ఎండీసీ హైదరాబాద్ ' మారథాన్ విజేతలకు గచ్చిబౌలి మైదానంలో సీఎం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "2028 ఒలింపిక్స్ లో తెలంగాణ అథ్లెట్లు అత్యధిక పతకాలు సాధించేలా కృషి చేస్తున్నాం. యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీని వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రారంభిస్తాం. 'ఖేలో ఇండియా' నిర్వహణను తెలంగాణకు ఇవ్వాలని కేంద్రానికి విన్నవించాం. 2036 ఒలింపిక్స్ నిర్వహణ బిడ్డింగ్ ను భారత్ గెలిస్తే హైదరాబాద్ లో గేమ్స్ నిర్వహించే అవకాశం ఇవ్వాలని కోరాం" అని రేవంత్ రెడ్డి తెలిపారు.



# 18 చోట్ల కూల్చివేతలు | 43 ఎకరాలు రికవరీ

- **అక్రమ నిర్మాణాల కూల్చివేతలు**
- **కబ్జాదారుల గుండెల్లో రైళ్లు..**
- **ఆక్రమణల్లో ప్రముఖుల ఆస్తులు**
- **ప్రభుత్వానికి హైడ్రా రిపోర్ట్**

హైదరాబాద్, ఆగస్టు 25 (ప్రజాస్వరం) : హైదరాబాద్ మహానగరంలోని అక్రమ నిర్మాణాలను 'హైడ్రా' నేలమట్టం చేస్తోంది. చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాల చిట్టాను ఒక్కొక్కటిగా విప్పుతూ.. అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. ఏ రోజు, ఎప్పుడు హైడ్రా కూల్చివేతలు చేస్తుందో తెలియక కబ్జాదారుల్లో వణుకు పుడుతోంది. ఈ క్రమ్మంలో కొందరు అయితే హైడ్రా నుంచి నోటీసులు అందక ముందే.. కోర్టులను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తుంది. గత 20 రోజులుగా నగర వ్యాప్తంగా చేపట్టిన కూల్చివేతలపై తెలంగాణ ప్రభుత్వానికి హైడ్రా రిపోర్ట్ అందించింది. ఇప్పటి వరకు 18 చోట్ల కూల్చివేతలు జరిపినట్లు తెలంగాణ ప్రభుత్వానికి హైడ్రా నివేదిక అందిచింది. 18 చోట్ల కూల్చివేతల్లో ఏకంగా 43 ఎకరాల స్థలాన్ని హైడ్రా కాపాడింది. నంది నగర్, మన్సూరాబాద్, బంజారాహిల్స్, లోటస్పాండ్, బీజేఆర్నగర్, ఎమ్మెల్యే కాలనీ, అమీర్పేట్, గాజులరామారంలో పలు నిర్మాణాలకు నేలమట్టం చేసినట్లు హైడ్రా ప్రభుత్వానికి రిపోర్టు ఇచ్చింది. ప్రముఖులైన పల్లంరాజు, సునీల్ రెడ్డి, రత్నాకర్రాజు, భాస్కర్రావు, అనుపమ కట్టడాలు సహా హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ ను కూల్చి వేసినట్లు హైడ్రా తన రిపోర్ట్ లో తెలిపింది. ప్రముఖుల ఫామ్ హౌస్ లను హైడ్రా కూల్చివేసింది.

### కూల్చివేతల లిస్ట్

- నంది నగర్‌లో ఎకరం స్థలాన్ని కాపాడిన హైడ్రా
- లోటస్ పాండ్‌లో పార్కు కాంపౌండ్ వాల్ కబ్జా చేసిన దానిని కాపాడిన హైడ్రా
- మన్సురాబాద్ సహారా ఎస్టేట్లో కబ్జాలు కూల్చివేత
- ఎమ్మెల్యే కాలనీలో పార్కు స్థలం కబ్జా కూల్చివేత
- మిథాలీ నగర్‌లో పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా
- బీజేఆర్ నగర్‌లో నాలాను కాపాడిన హైడ్రా
- గాజులరామారం మహాదేవ్ నగరంలో రెండంతస్తుల భవనం కూల్చివేత
- గాజుల రామారావు భూదేవి హిల్స్ లో చెరువు ఆక్రములను చేసిన బోనాలు కూల్చివేత
- బంజారా హిల్స్‌లో ఆక్రమించుకున్న రెస్టారెంట్ భవనం కూల్చివేత
- చింతల్ చెరువులో కబ్జాలను కూల్చివేసిన హైడ్రా
- నందగిరి హిల్స్‌లో ఎకరం స్థలం కబ్జాలు కూల్చివేత
- రాజేంద్రనగర్ చెరువులు కబ్జాలు కూల్చివేత
- చందానగర్ ఏర్ల చెరువులో కబ్జాలు కూల్చివేత
- ప్రగతి నగర్ ఎర్రగుంటలో నిర్మించిన అక్రమ కట్టడాలు కూల్చివేత
- బోడుప్పల్ చెరువులో నిర్మించిన ఆక్రమణలు కూల్చివేత
- గండిపేట చెరువులో నిర్మించిన ఫామ్‌హౌస్‌లు కూల్చివేత

### ప్రముఖుల లిస్ట్

- ఎంఐఎం ఎమ్మెల్యే మోబిన్
- ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా బేగ్
- మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు
- టీటీడీ మాజీ సభ్యుడు, కావేరి సీడ్స్ యజమాని భాస్కర్ రావు
- మంతిని బీజేపీ నేత సునీల్ రెడ్డి
- ప్రో కబడ్డీ యజమాని అనుపమ
- హీరో నాగార్జున
- ఎమ్మెల్యే దానం నాగేందర్


## రుణమాఫీని పక్కదోవ పట్టించేందుకే 'హైడ్రా'మా

**ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 25 (ప్రజాస్వరం): హైడ్రా పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రామా చేస్తున్నారని భాజపా శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హైడ్రా కేసు పెట్టినప్పుడు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. నిత్యం ఏదో ఒక సంచలనం చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి పని అని ఎద్దేవా చేశారు. సీఎం సోదరుడితో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై అక్రమ నిర్మాణాల ఆరోపణలున్నాయి. సెలబ్రిటీల నిర్మాణాలు కూల్చివేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. రుణమాఫీ అంశాన్ని పక్కదోవ పట్టించేందుకే హైడ్రాతో హైప్ ఇస్తున్నారన్నారు.

## రాజకీయ కక్షతోనే దాడులు

**హైడ్రాపై హరీశ్ రావు ఆరోపణ**



హైదరాబాద్, ఆగస్టు 25 (ప్రజాస్వరం): రాజకీయ కక్షలో భాగంగానే హైడ్రాతో దాడులు చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పల్లా రాజేశ్వర్ రెడ్డిపై ఆరు కేసులు పెట్టారని ఆయనపైనే కాకుండా ఆయన భార్యపిల్లలు ఎవరిపైనో దాడి చేశారని అక్రమ కేసులు పెట్టారని, పల్లాను మానసికంగా పొలిటికల్‌గా, ఆర్థికంగా ఇబ్బంది పెట్టేందుకు రేవంత్ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతుందని అన్నారు. హైడ్రా పేరు చెప్పి నియమనిబందనలు లేకుండా పల్లా ఇనిస్టిట్యూషన్లపై దాడి చేయిస్తున్నారని, ఆయనను రాజకీయంగా ఎదుర్కోలేక ఆర్థికంగా దెబ్బదీసే ప్రయత్నాలు చేయడం సరైనది కాదని, పల్లా కాలేజీలో ఇంచ్ భూమి ప్రభుత్వానిది ఉన్నా 24 గంటల్లో ఆయనే కూలగొట్టిస్తాడని చెప్పారు. పల్లా మెడికల్ కాలేజీ నిర్మాణం జరిగిన సర్వే నంబర్ 813/పి 2018 లో వ్యవసాయ భూమి నుంచి వ్యవసాయేతర భూమిగా మార్చబడిందని, అందులో చెరువు శికం భూమి ఉంటే అధికారులు ఎలా పర్మిషన్ ఇస్తారని ప్రశ్నించారు. అలాగే మెడికల్ కాలేజీ విషయంలో ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ సహా అధికార యంత్రాంగం అంతా ఎన్‌ఓసీలు, పర్మిషన్లు ఇచ్చిన తర్వాత దాడి చేస్తామంటే ఇది కేవలం రాజకీయంగా జరుగుతున్న కుట్ర మాత్రమేనని ఆరోపించారు. తాము హైడ్రాకు వ్యతిరేకం కాదని, అక్రమాలను సమర్థించమని చెబుతూ.. టార్గెటెడ్ గా పొలిటికల్ గా కుట్రలు చేస్తే అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించొద్దని, దయచేసి డాక్యుమెంట్లు అన్ని పరిశీలించిన తర్వాత నోటీసులు ఇచ్చి అప్పుడు కూల్చివేతలు జరపాలన్నారు. ఆసుపత్రులు, కాలేజీలను రాజకీయ కక్ష్యలకు కేంద్రంగా మార్చొద్దని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయంగా కక్షసాధింపు చర్యలకు పాల్పడం మంచిది కాదన్నారు.

## చిత్రపురి కాలనీలో 225 విల్లాలకు నోటీసులు

**15 రోజుల్లో వివరణ ఇవ్వకపోతే కూల్చివేతలు**

హైదరాబాద్, ఆగస్టు 25 (ప్రజాస్వరం): హైదరాబాద్ మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పలు నిర్మాణాలకు కమిషనర్ నోటీసులు జారీ చేశారు. చిత్రపురి కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన పలు విల్లాలకు ఈ నోటీసులు ఇచ్చారు. జీ+1 నిర్మాణానికి అనుమతులు పొంది జీ+2 నిర్మించారని నోటీసుల్లో పేర్కొన్నారు. దీనికి 15 రోజుల్లోగా వివరణ ఇవ్వకుంటే కూల్చివేతలు చేపడతామని హెచ్చరించారు. చిత్రపురి కాలనీలో జీవో 658 కి విరుద్ధంగా 225 రో హౌస్ లు కట్టినట్లు మున్సిపాలిటీ అధికారులు గుర్తించారు. వాస్తవానికి ఈ విల్లాల నిర్మాణానికి జీ+1 మాత్రమే అనుమతి ఉంది. కాగా, గత పాలక వర్గం తప్పుడు నిర్ణయం వల్ల చిత్రపురి సొసైటీకి సుమారు 50 కోట్ల నష్టం జరిగిందని ఫిర్యాదులు అందాయి. దీంతో అవకతవకల విషయం తేల్చేందుకు మణికొండ మున్సిపల్ కమిషనర్ తాజాగా నోటీసులు జారీ చేశారు.

